

# దోషి

"ఒరేయ్! కన్నతల్లికంటె కట్టుకున్న పెళ్లాం ఎట్టి పరిస్థితిలోనూ ఎక్కువ కాదురా!"

" ఈ వయస్సులో ఆ ముసిల్దానికి ఆ కష్టమేందిరా ? పొయిలోకి పుల్లల్లేవని, ఎడారిలాంటి అడవిని వడగట్టి, ఎండుకట్టె లేరుకొస్తున్న కట్టెలాంటి నీ తల్లిని జూడరా"

"ప్రపంచంలో నువ్వొక్కడివే కాపురం జేయటం లేదురా! మేమంతా ఆ దిక్కుమాలిన సంసారాలెలగ బెడ్తున్నోళ్ళమే. మాకూ పెళ్ళాం పిల్లలున్నారు. కాకపోతే నీ పెళ్లాంలాగా ఎర్రగా, బుర్రగ్రా లేకపోవచ్చు. అంతమాత్రాన మా పెళ్ళాలు బెల్లాలు గాలేరు; తల్లులు అల్లాలు గాలేరు."

"నీ తల్లి ఒంట్లో శక్తి ఉన్నంత కాలమూ ఎట్లాగో తిప్పల వడ్డది. ఇంకా ఎన్నాళ్ళురా ఈ కష్టం దానికి? అసలు నువ్వేందిరా పులిలాంటోడివి, ఆలిని జూడగానే పిల్లివైపోయినావేందిరా?" హనుమాండ్ల గుడివారగా వెళ్తున్న ఇస్మాయిల్‌ను రాంరెడ్డి దొరక బుచ్చుకొని హితోపదేశం చేయసాగాడు.

ఒకే ఊళ్ళో పెళ్ళాంతో వేరు కాపురముంటున్న ఇస్మాయెల్ వీలు చిక్కినప్పుడల్లా తల్లిని చూసిపోతుంటాడు. ఆ పని మీదే వెళ్తుండగా రాంరెడ్డి కంటపడ్డాడు....

ఆ మాటలు ఇస్మాయెల్‌కు గుండెల్లో తాకాయి. మహేజబీ అందం అతడ్ని పిచ్చివాడ్ని చేసింది. తనకంటె అన్ని రకాలుగా పెద్దదైన ఆవిడ్ని ఏరికోరి, పట్టుబట్టి చేసుకున్నాడు. ఆ పెళ్ళితో తాను ఎంతో సాధించానని పొంగిపోయాడు. రోజులు గడస్తున్న కొద్దీ తల్లి ప్రేమకు దూరం అయ్యాడు. నిజం తెలుసుకునే లోపే చాలా ఆలస్యం అయిపోయినట్లనిపించ సాగిందతనికి అమ్మ ఆత్మాభిమానాన్ని, పెళ్ళాం ఆనందాన్ని, తన మనశ్శాంతిని కాపాడుకునేందుకు ఉన్న ఊళ్ళోనే వేరే కాపురం పెట్టడం కేవలం పెళ్ళాం ఆనందాన్ని నిలబెట్టడానికే పనికొచ్చింది.

అసలే ఆరోజు పెళ్ళాంతో గొడవపడ్డ ఇస్మాయిల్‌కు రాంరెడ్డి మాటలు మనసు అగ్గిలో మంటల్ని మరింత తీవ్రం చేశాయి. తన తల్లి దీనావస్థకు పెళ్ళామే ఏకైక కారణమనే నిర్ణయానికొచ్చేశాడు. గిరుక్క వెనక్కి తిరిగి గబగబా అడుగులేయసాగాడు.

ఇస్మాయెల్ ప్రవర్తన ఏదో కీడును సూచిస్తున్నట్టనిపించింది రాంరెడ్డికి. గట్టిగా కేకేశాడు–

ఇస్మాయెల్‌కది వినబడనే లేదు.

✠ ✠ ✠

"ఏందో శాంతమ్మొదినా, నేను కసాయిదాన్నని, తల్లినీ బిడ్డనూ యెడబాపినానని నన్నంతా ఆడిపోసుకుంటారు గానీ, నా జాగాలో ఎవ్వరున్నా, ఇంతకన్నా ఏంజేస్తారు చెప్పు?" పంచదార అరువుకోసం వచ్చిన పక్కింటి శాంతమ్మతో తనగోడు వెళ్ళబోసుకునే ప్రయత్నం – మహేజబీది.

"హుఁ! లోకం కాకులే తల్లీ! యీాల్లిట్లాగే అరుస్తారు. యీాల్ల సొమ్మేంపోయింది? మనం పచ్చగా ఉంటే ఆళ్ళ కళ్ళలో ఎరుపు. మనం ఎర్రగా ˆగిపోతుంటే ఆళ్ళకళ్ళు నీలం. మనకెట్లా మంచిగుంటే అట్లా ఎల్లదీసుకుంటాంగానీ అన్నోళ్ళ మాటలన్నీ యినుకుంట బోతే సంసారాలెట్లా సాగుతయ్?" పని వెళ్ళదీసుకునే పరమార్థమెరిగి శాంతమ్మ మహేజబీ మనసు పొయ్యిలో మంటల్నెగదోసింది.

"ఏం జెప్పనొదిన, నేను కొంచెం పప్పన్నం దిన్న ఇంట్లో నుంచి వొచ్చినదాన్ని.

ఈడ గొడ్డుకారం బెడితే వోతదా? 'నిన్నైతే పెండ్లి జేసుకుంట, లేకుంటే పాణం దీసుకుంట' అంటాని యెంటవడీ, యెంటవడీ నన్ను గట్టుకున్నాడా? ఆ యింట్లోకివోతే ఏముంది? కుండలు - చాటలు గొట్లాడుకుంటున్నయ్. ఆ ముసల్దానికి చాతగాదు. ఈ వొయిసోనికి మనసురాదు. మరి ఎట్ల ఎల్లదీసుకున్నారో ఆ అల్లాకే యెరుక. ఇది సూడజాలక మా అబ్బాజాన్ ఉప్పుతో తొమ్మిది ఇచ్చి పంపుతుంటే - కట్టుకున్న పాపానికి మొగనికైతే పెట్టుకుంటానేమో, అడ్డమైనోల్లకి బెట్టాలంటే, నామనసుకెట్లొప్పుతది? అందుకే వేరే సంసారం బెడితే వొస్త, లేకుంటె 'తలాక్' జెప్పుమంటాని నిలదీసిన, తప్పా వొదినా?" కాపురం కాపాడుకునేందుకు కడుపు చించుకుంది మహేజబి.

"ఆ! తప్పెట్లైతదొదినా? అది తప్పనిసరిగాని, అయినా ఆ ముసల్ది కష్టపడ్తున్నదని ఇప్పుడంగలారుస్తున్నారు గాని, ఈ కష్టం నీవొచ్చినంక గల్గిందిగాదు. ఆ రోషన్‌బీ నేను జూసిన కాలం నుండి గట్లే కష్టపడుతున్నదమ్మా! అనరాదుగానీ, నీ మొగుడు ఏనాడు కష్టంజేసిన పాపానవోయిందు? 'తిండికి తిమ్మరాజు! పనికి పోతరాజు!' నిండుగదిని, నూనెనాగన్నలాగ దిరగమరిగినోడు. వానికెంతసేపూ తెల్లటి బట్టలేసుకోని సైనీమలు జూసుకుంట, సోకులు జేసుకుంట దిరుగుడే సరిపొయ్యింది." కట్టెవిరగకుండా 'పని' చక్కబెట్టుకునే యత్నం శాంతమ్మది.

"ఇప్పటికన్న జెర్ర తోవలవడ్తే బాగుండొదినా! ఏంలాబం? శివారెడ్డి పేట కంపెనీల ఎవర్నో బతిమలాడి అబ్బాజానే కొలువు జూపించ్చిండు. రెండ్రోజులు వోతడు కాళ్ళు గుంజుతున్నయ్, చేతులు గుంజుతున్నయ్' అంటానికతలు జెప్తడు." భర్త అలసత్వం భరింపరానిదిగా తయారైంది నిజంగానే ఆ యిల్లాలికి. చంద్రబింబంలాంటి ముఖాన్ని దిగులు మబ్బులలుముకున్నాయి.

"అc! తల్లివైతున్నవ్ గదా! ఇప్పుడన్నీ సక్కగైతయ్ తియ్. ఆ వచ్చేటోడు వంగోబెట్టి అయ్య ముడ్డిమీద దన్నుతడు." ఇంటికెళ్ళాల్సిన సంగతి గుర్తుచేసుకొని, సత్వర కార్యసాధనకు రంగం సిద్ధం చేసుకుంది శాంతమ్మ.

తల్లినౌతున్నానన్న మాట గుర్తు చేయగానే మహేజబీ బుగ్గలు ఎరుపెక్కాయి. సిగ్గు భారం ఆమెను కుంగదీసింది. రెప్పలు బరువై ఎదురుగా కూర్చున్న శాంతమ్మనే చూడలేకపోయింది. ఆ భారంతో మాటలు కూడా దొరకలేదామెకు.

"ఇంతకూ నీ మొగుడితో ఈ సంగతి జెప్పిన లేదా?" మహేజబీ ఆనందానికి హంగులద్దుతూ గుసగుసగా అంది శాంతమ్మ.

"ఉహుఁ ... " సిగ్గు తెరల తొలగించుకునే ప్రయత్నం చేస్తూ - "ఇంకా వీలుగాలేదు. ఈ రాతిరికి జెబుతా." అంటుంటే బుగ్గలు గులాబీ రంగు నుండి మందారం రంగులోకి మారిపోయాయి.

"పోతానొదినా! ఎసట్లో బియ్యం పోయాలి. ఓ పక్క పాలూ మరిగిపోతుంటాయి." సరియైన అదను చూసుకుంది శాంతమ్మ.

పంచదార తెచ్చి పెట్టేందుకు లోపలికెళ్ళింది మహేజబీ.

❖ ❖ ❖

"ఏందీ! ఊరు పొద్దుగూకలేదు. అప్పుడే నిద్రబోయినవా?"

భర్తకోసం ఎదురు చూసి, చూసీ బేజారెత్తిన మహేజబీ ఆకలి అలసట - నిరీక్షణను మోయలేని భారంగా మార్చగా, తలుపురెక్కకు జేరగిలబడి, కనురెప్పలు వాల్చింది... ముద్దుగా వచ్చి, ముద్దుల్తో మేల్కొలుపుతాడనుకున్న భర్త, ఇలా చెర్నాకోలా ఝుళిపించడం ఆమె జీర్ణించు కోవడం కష్టమైంది.

'అయినా, ఎప్పుడూ తననుకున్నట్లే అతనుండాలంటే ఎలా? అతనికీ కోపతాపా లుంటాయి కదా! పొద్దుననగా గొడవపడి పోయినోడు. ఎక్కడున్నాడో? ఏం తిన్నాడో?' అనుకుంటూ నెమ్మదిగా లేచి కడుపు తుడుముకుంటూంటే అతనిమీద ఎక్కడలేని ప్రేమా, గౌరవం పుట్టుకొచ్చాయి. 'బాగా పొద్దుపోయినట్లుందే' అనుకుంటూ, పెద్ద చెంబుతో కాళ్ళు కడుక్కునేందుకు నీళ్ళిచ్చింది.

గబుక్కున లాక్కున్నాడు ఇస్మాయెల్.

'ఈ కోపమంతా మురిపెంగా మారే క్షణాలు ముందున్నాయి తియ్!' అనుకుంటుంటే మహేజబీ మనస్సుకు కితకితలయ్యాయి.

పెళ్ళాం బుగ్గల ఎరుపును గానీ, కళ్ళల్లో మెరుపునుగానీ చూసే స్థితిలోలేని ఇస్మాయెల్ తన ధోరణిలోనే అరిచాడు - " అందుకే అందరూ అంటారు. నువ్వు 'నిద్ర' కు మాత్రమే పనికొస్తావని". భార్యను ఆ స్థితిలో చూసేసరికి కోపం రెట్టింపయ్యిందతనికి.

భర్తమాటలతో బిక్క చచ్చిపోయిందామె. ఎంతో అందమైన క్షణాలను ఊహించుకున్న మహేజబీ కళ్ళముందు దట్టమైన చీకటి పరచుకుంది. 'ఛీ! ఏం మనిషి? ఇంత దిగజారినాడేంది?' మాటల్ని మరచిపోయి, దుఃఖాన్ని నొక్కిపట్టే ప్రయత్నం చేస్తూ, అతనివైపు చూడలేక గోడనానుకొని జారగిలబడి నిలబడింది. ఇస్మాయిల్‌కి ఆమె ఆలస్యం చూస్తుంటే పైనబడి తన్నాలన్నంత కోపంగా ఉంది 'ఔరా! ఆడదెంత నంగనాచి? ఏదోరకంగా లోబరచుకొని, పనిసాధించాలనుకుంటుంది. నేనింకా దాని మాయలోనే ఉన్నాననుకుంటున్నది కాబోలు' కసిగా పళ్ళు నూరాడు.

వికలమైన మనసుతో యాంత్రికంగా భర్తకు వడ్డించింది. అతనికిష్టమని బిర్యానీ, ఖీర్ చేసింది. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, తన స్థితికి 'ఆయన' ఆటపట్టిస్తుంటే మారాం చేస్తూ, అలకలుపోతూ కమ్మగా భోజనం చేయాలన్న ఆలోచన అర్థంలేకుండా పోవడమే గాదు, ఏదో తెలీని భయం మనసంతా ఆవరించి క్షణాల్లో మాధుర్యం స్థానంలో చేదును నింపసాగాయి.

ఆకలిని పెనవేసుకున్న కోపం ఆలోచనా రహితంగా ఆవురావురమంటూ తినేలా చేసింది ఇస్మాయెల్‌ను.

మాట వరసకైనా తన తిండి గురించి ప్రస్తావించని ఇస్మాయెల్‌ను చూస్తే, ఆకలితో పాటు బాధనూ తట్టుకోలేక మహేజబీ పేగులు ఉంగలు చుట్టుకుపోసాగాయి. దుఃఖం ఆపుకోలేక, నరాలు చిట్లే ఆవేదనతో వంటింటి అడ్డగోడ పక్కనజేరి, కుమిలికుమిలి ఏడ్వసాగింది.

భోజనం అయిందనిపించిన ఇస్మాయెలుకు పెళ్ళాం ఏడుపు వినిపించగానే ఒళ్ళంతా కంపరమెత్తింది. 'దీని కళ్ళ నీళ్ళు చూడలేననే గదా, నన్ను సాధించేందుకు రంగం సిద్ధం చేసందిది. ఇట్లా ఇంకెన్నాళ్ళు నన్ను సాధిస్తుందిది?' అనుకునే సరికి ఒళ్ళు మరచిపోయాడు. ఉన్నపళంగా మహేజబీ రెక్క పట్టుకొని పై కెత్తాడు.

ఎన్నోసార్లు అలిగిన తనను రెండు చేతులతో పైకెత్తి, కళ్ళు తుడిచి, అలకతీర్చి, ఆర్తిగా అక్కున జేర్చుకొని, భర్త తనను లాలించిన మధుర క్షణాలు ఆమెకు తీపి గుర్తులే. అందుకే, ఆ ప్రేమ పొందుకే వాళ్ళ దాంపత్యం కొనసాగుతుందనీ ఆమె నమ్మకం. కాని... ఆ క్షణంలో మునుపు ఎప్పుడూ చూడని నెత్తురు చారలు అతని కళ్ళనిండా పరచుకొని

ఉన్నాయి. ఆ కళ్ళు చూడగానే, పులిచేత జిక్కిన జింకపిల్లలా ఆమె కళ్ళనిండా భయం తప్ప, మరో భావం ఆమె దరిదాపుల చేరడానికి సైతం భయపడసాగింది.

"ఏందే? ఇట్ల ఎన్ని దినాలు నీ యేడుపుతో నన్ను మాయ జెయ్యాలని జూస్తవు? అసలిప్పుడు నిన్నేమన్నాననే ఈ ఏడుపు?" భార్య నిస్సహాయత నిండిన మౌనం ఇస్మాయెల్ కోపానికి బలాన్ని జోడించగా గూబ అదిరిపోయేటట్లు చాచికొట్టాడు.

తూలిపడిపోయింది మహేజబీ.

"సర్దుకో! అన్నీ సర్దుకో! ఈ రాత్రికే అమ్మదగ్గరికి పోవాలె మనం!" కటువుగా ఆజ్ఞాపిస్తూ, తర్జని చూపాడు.

"నేను... చ... చ్చి.... పో...తా...!" ఒంట్లోని శక్తినంతా మాటలుగా మార్చి, బిగ్గరగా అరచి, నిస్త్రాణంగా పడిపోయింది మహేజబీ.

✠ ✠ ✠

కాలానికి జీవితాన్ని శాసించే శక్తి ఉందన్న విషయం మరోసారి రుజువైంది.

అర్ధాంగిని అపురూపంగా చూసుకునే ఇస్మాయిల్ అనుకోని పరిస్థితుల్లో ఆమె పై చేయిచేసుకోవడం అతని జీవిత గమనాన్నే మార్చేసింది. సంవత్సరాల తరబడి పేరుకుపోయిన సోమరితనం ఒక్క దెబ్బతో వీగిపోయింది. అంతేకాదు, రేయింబవళ్ళు కష్టపడి పెళ్ళాన్నీ, తల్లినీ తనే హుందాగా పోషించుకోవాలనే నిర్ణయానికొచ్చాడు. పూవులమ్మినచోట కట్టెలమ్మలేక – ఉన్న ఊళ్ళో పూల రంగడిలా చలామణీ అయిన ఇస్మాయెల్ సనత్‌నగర్ చేరుకొని కూలీ ఇస్మాయెల్‌గా మారిపోయాడు.

మరోపక్క అత్తమీది కోపం దుత్తమీదికి మళ్ళినట్టు – మొగుడి నిర్వాకానికి ముసలి అత్తే కారణమని ఆమె మీద మరింత ద్వేషం పెంచుకుంది మహేజబీ. ఆమె తండ్రి కూడా కూతురు పరిస్థితికి కుమిలిపోయాడు. "అడదాన్ని పట్టుకొని అంగలార్చే వెధవలు! ఎవడికి మాత్రం ఉపయోగం? అందర్నీ బాధపెడ్తూ ఇట్లానే నాశనమైపోతా" రని అంగట్లో అందరి ముందూ అరచినా బిడ్డ మొహంలో ఆనందాన్ని వెలిగించేది అల్లుడేనన్న సత్యం అతనికి తెలియంది కాదు. ఆమెను అనునయిస్తూనే, అల్లుడికోసం అన్వేషణ కొనసాగించాడు– ఖజామియా. ఎలాగైతేనేం అల్లుడ్ని పట్టుకోగలిగాడు.

ఓ సాయంత్రం సనత్‌నగర్ ఓవర్ బ్రిడ్జి పక్కనున్న గుడిసెల కూడలిలోని ఓ గుడిసెలో. ఎప్పుడూ ఇస్త్రీ బట్టలకు సెంటుపూసుకొని సినిమా హీరోలా తిరిగే ఇస్మాయెల్‌ను ఆ స్థితిలో చూసి నమ్మలేకపోయాడు. మాసిన గడ్డం, చిరిగిన చొక్కాలో పాడైపోయిన వత్తీల స్టౌ రిపేర్ చేసుకుంటున్నాడు.

"ఏందయ్యా ఈ పరిస్థితి. ఇట్ల ఇంట్లో జెప్పకుండా వస్తే, మేమంతా ఏమై పోవాల? వస్తే వచ్చినవ్, తర్వాతనన్నా ఖబర్ ఇయ్యాల గదా?" పరామర్శలయ్యాక మెత్తగా ఆత్మీయంగా మందలించాడు ఖజామియా.

క్షణమాగి, నెమ్మదిగా చెప్పాడు.... "చెప్పాలనే అనుకున్నా. అనుకోకుండా వచ్చేశా." ఒక్కసారి తన ఊరు – తన సొంత ఊరు – సొంతం కళ్ళముందు సాక్షాత్కరించింది. గుండె గొంతులోకొచ్చింది. ఆత్మీయం కళ్ళల్లో అశ్రురూపం దాల్చింది.

అనుభవజ్ఞుడైన దర్జీ సూది బెజ్జంలోకి తొట్రుపడకుండా దారానెక్కించినట్లు అల్లుడి గుండెలోకి అన్నీ చేరవేశాడు ఖజామియా. మీ అమ్మ మంచంపట్టింది. ఆమెకు దమ్మూ, దగ్గూ పెరిగినయ్. నా బేటీ అయితే నువ్వొచ్చిన వారం రోజుల దాకా తిండిముట్టలేదు. తినకపోతే దానికే గాక, లోపలి బిడ్డకు గూడా కష్టమని, ఎట్లనో సముఝాయించి మనుషుల్లకు మల్లేటట్లు జేసిన."

కొన్ని క్షణాలపాటు ఆశ్చర్యం నుండి తేరుకోలేకపోయాడు ఇస్మాయెల్ మామ జెప్పిన మాటలు అర్థమయ్యీ అర్థంగానట్లున్నాయి. అందుకే మళ్ళీ అడిగాడు!

"ఏంది మామా నువ్వంటున్నది?"

"అవున్నాయనా! నువ్వు తండ్రివి గాబోతున్నావు. గా సంగతి చెబుదామనే, నువ్వు కొట్లాడివచ్చిన రోజు రాత్రి మహెజా మంచిగా ఖీర్, బిర్యానీ చేసి పెట్టిందట. అంతలోనే నీవు దాన్ని మాట్లాడనియ్యకుండా .... " కూతురు చెప్పిన సంఘటన తలచుకోగానే బాధతో గొంతుపూడుకుపోయింది.

ఇస్మాయెల్ కళ్ళు మరోసారి చిప్పిల్లాయి. ఒక్కసారి మహెజబీ రూపం, ఆ రాత్రి జరిగిందంతా గుర్తుకొచ్చింది. అల్లుడిలోని మార్పు మామ కళ్ళలో ఆనందబాష్పాలు నింపింది.

* * *

"ఒక్కసారి ఇంటికొచ్చేసేయ్ బాబూ! నిన్నుజూడక నా తల్లి - మనిషి మనిషిలాగా లేదు. మీయమ్మ గూడా నీమీద బెంగపెట్టుకున్నది." కీలెరిగిన వ్యవహారం ఖజామియా అనుభవం.

ఆలోచనలో పడిపోయాడు ఇస్మాయెల్.

'ఇంకా ఏమాలోచిస్తవ్ నాయనా! ఒక్కసారి ఇంటికొచ్చి, అందర్నీ పలకరించి వొచ్చేసెయ్." ఏదో శంక.

"నాక్కూడా ఇప్పుడే వచ్చేయాలనుంది మామా! కాని, వారం రోజుల దాకా వీలుకాదు. కాంట్రాక్టుపనిలో ఉన్నాం. ఇంకా ఏడెనిమిది రోజులైనా అయితది. మద్దెల వొచ్చేస్తే మనకేలాస్. పని పూర్తికాంగానే పైసల్ దీసుకోవాలె ఇక్కడ. మద్దెన లేకపోయినా, పైసలిచ్చేటప్పుడు లేకపోయినా కిరికిరీ పెడ్తరు. ఆకరుకి పైసలియ్యకుండా తిప్పలపెడ్తరు. పని పూర్తిగాంగానే వొచ్చేస్తా". నమ్మకంగా చెప్పాడు.

నమ్మకపోవానికేమీ లేదక్కడ. ఆ మాటల్లోని ప్రతి అక్షరం భార్యనీ తల్లిని చూడాలనే ఆరాటాన్ని మోసుకొస్తూంది.

"మంచిది బిడ్డా! తప్పక రావాలి మరి! ఈ సంగతి దెలిస్తే నా బిడ్డకు మల్ల ప్రాణమొచ్చినంత పనైతది." 'ఎప్పుడెప్పుడు ఇంటికెళ్ళి తన కూతురితో ఈ సంగతులన్నీ ముచ్చటించాలా' అనే తపన ఆ తండ్రి గుండెల్లో - "రాత్రికి బీదర్‌బండిలో ఎల్లిపోతా" అంటూనే అల్లుడ్ని అడిగాడు. "పైసలేమన్న గావాల్నా?"

ఊళ్ళో ఉన్న రోజుల్లో 'నీ బిడ్డకి అదిగొనిపెడ్తా, ఇది జేయిస్తా' నని దబాయించి డబ్బులు పట్టుకెళ్ళి ఉడాయించె ఇస్మాయెల్‌ని అప్పుడు చూస్తే ఒంట్లో అంగారం పోసుకున్నట్టుండేది. ఆ అల్లుడ్నే ఇప్పుడు చూస్తే చెప్పినట్టు వినే బుద్ధిమంతుడైన కన్న కొడుకును చూస్తున్న అనుభూతి కల్గుతోంది.

సమాధానంగా ఓ నవ్వు నవ్వాడు ఇస్మాయెల్. అది అనేక భావాల సంగమమై వెల్లి వెరిసింది. "పైసలడిగే రోజులు పొయినయ్ మామా. ఇప్పుడు మీ అల్లుడు తానే ఇచ్చే స్థితిలో ఉన్నాడు. ఈ నెలరోజుల నుండి నాలుగువేలు జమచేసిన. ఇప్పుడే నాంపల్లి బోయి నీ కూతురుకి, అమ్మకీ బట్టలు తీసుకుందాం. రేప్పొద్దున బండితో ఎల్దువుగానీ".

మరో మాట మాట్లాడనీయకుండా మామనొప్పించేశాడు.

✠ ✠ ✠

సంతోషం, ఉద్వేగం, ఒకింత ఆరాటం, మరికొంత అపనమ్మకం మహేజబీని నిలువనీయకుండా చేస్తున్నాయి. ఆ రోజు భర్తవస్తున్నాడనే విషయం తెలిసింది. ఎనిమిదింటికి గానీ నిద్రలేవని ఆమె తెల్లారకుండానే లేచి తలంటుకుంది. ఆయనకిష్టమైన ఆకుపచ్చ రంగు చీరకట్టుకుంది. మంజీరాలు వేసుకుంది. బొడ్లో వెండి కీబంచ్‌ని పొట్టకు వత్తిడి కల్గకుండా జాగ్రత్తగా దోపుకుంది. మొగుడు పంపిన కొత్త బురఖా నాలుగు సార్లు వేసుకొని చూసుకొని 'ఆయనొచ్చాక వేసుకొని చూయించొచ్చులే. ఇప్పట్నుంచీ వేసుకుంటే చూసిన వాళ్ళేమనుకుంటారు?" అని తీసి మడతచేసి పెట్టింది.

మాటిమాటికీ గడియారం వంక చూస్తుంది. మంచం మీదికెళ్ళి పడుకుంటుంది. పక్కనే భర్త తన చిలిపి చేష్టల్తో ఇబ్బంది పెడ్తున్న మధురోహలు మనసుపొరల్లో చేరి, మేనిలో పులకాంకురాలను రేపుతాయి. బుగ్గలెరుపులెక్కుతాయి. ఈ నేపథ్యంలో మాటి మాటికీ పొట్టను తడుముకుంటుంది.

గడియారాన్ని చూసినప్పుడల్లా అది కదలక - మెదలక తనను ఆటపట్టిస్తుందని విసిరి అవతల పారేయాలన్నంత కసి పుడ్తుంది.

'వస్తాడో - రాడో?' అంతలోనే ఏమైనా పని ముంచుకొస్తుందేమో! ఎలా ఉన్నాడో? ఇన్నాళ్ళూ తన గురించి ఆలోచిస్తూనే ఉన్నాడా? అబ్బాజాన్ మాటల్ని బట్టి చూస్తే... బాగా చిక్కిపోయుంటాడు. అయినా కళ్ళల్లో మెరుపు, గుండెల్లో వలపు మరింత ఎక్కువయ్యే ఉంటాయి.... ఎడతెగని ఆలోచనలు తేనెటీగల్లా ముసురుకుంటుంటే పిచ్చెక్కినట్టుంది.

కొడుకును చూడకుండానే పోతానేమోనన్న నైరాశ్యంలో నుండి తేరుకొని కళ్ళల్లో ప్రాణం నిలబెట్టుకున్నది రోషన్‌బీ. కొడుకు ఎడబాటుతో కుంగిపోయిన అబక్క ప్రాణాన్ని వాడెల్లిపోవడానికి ఈ ముసలి తల్లే కారణమన పనిగట్టుకుని ప్రచారంచేసి మరింత రెపరెప లాడేట్లు చేశాడు ఖజామియా, అతనిబిడ్డ. తోడులేక, చేత గవ్వలేక, సాయమందించే దిక్కులేక, ఒక్కగానొక్క కొడుకును చూసేందుకు ప్రాణాలుగ్గబట్టుకుంది ఆ అమాయక మాతృమూర్తి. రోషన్‌బీ మంచితనాన్ని గుర్తెరిగిన ఇరుగు-పొరుగు ఒకళ్ళిద్దరు తోచిన సాయం తీరిక వేళల్లో చేస్తూ ఆ ఇంట్లో దీపమారిపోకుండా కాపలా కాస్తున్నారు.

✠ ✠ ✠

సంబంధం

రాష్ట్రానికి అప్పులెన్ని బలిసినా, కరెంటు అవసరాలు తీర్చకుండానే బిల్లుల్ని తినేస్తున్నా జన్మభూమి కార్యక్రమం అవధికంగా సాగడంతో ఆ ఊరి రోడ్డు బాగైంది. 'నేనొస్తున్నా' ననే విషయాన్ని కిలోమీటర్ దూరం నుండే 'దబదబా' చాటుకుంటూ ఎర్రబస్సు హనుమాండ్ల దగ్గరకొచ్చి ఆగింది.

బిడ్డపోరు పళ్ళేక గంటసేపట్నుండీ ఎదురుచూస్తున్న ఖజామియా నిరీక్షణ ఫలించి, అలసట చోటే ఆనందం చిందులేసింది. 'ఆగయే బేటా!' అంటూ ఆప్యాయంగా అలింగనం చేసుకొని, సూట్‌కేస్ అందుకొని, తన ఇంటివైపు దారితీశాడు.

"మామా! ముందు అమ్మను చూడాలి.... " ఇస్మాయెల్.

"చూద్దువుగాని బేటా. నువ్వు వస్తున్నావన్న మాట చెప్పిన క్షణం నుంచీ బిడ్డనీ కోసం ఎదురు చూస్తున్నది. ఒక్కసారి దానికంట్లబడి ఇంటికెళ్లిరా!" జవాబు కోసం చూడకుండా చకచకా సాగిపోయాడు ఖజామియా.

ఇంట్లోకి అడుగుపెట్టగానే లతలా అల్లుకుపోయింది మహేజబీ. వెక్కి వెక్కి ఏడ్చింది. ఆయన్ని తడుముకొని ముద్దులు పెట్టుకుంది. అతని చేతితో తన పొట్టను నిమరజేసుకొని ఆనందంతో ఉక్కిరిబిక్కిరయింది.

అన్నం తిని వెళ్ళమని బతిమలాడింది.

అప్పుడు టైం చూసుకున్నాడు ఇస్మాయెల్. 'అప్పుడే అరగంటైపోయిందా' అనుకునే సరికి కాళ్ళాగలేదు. పరుగులాంటి నడకతో వెళ్తున్న ఇస్మాయెల్‌కు మహేజబీ మాటలు వినబడలేదు.

ఏదో కీడును శంకించిందామె మనసు.

✠ ✠ ✠

కళ్ళల్లో ప్రాణం నిలబెట్టుకున్న రోషన్‌బీ మాటపడిపోయి అప్పుడే ఇరవై నాలుగ్గంటలైంది. ప్రతిపది నిముషాలకొకసారి జీవంలేని ఆ గాజు కళ్ళు ఏదో శక్తితో బలవంతంగా తెరచుకుంటాయి. ఆశతో చుట్టూ చూస్తాయి. మరుక్షణం మూసుకుంటాయి. మొహంలోని చైతన్యం అంతరించిపోతుంది. శబ్దంలేని కనుగుడ్లు ఇసుకలో నత్తల్లా కదుల్తాయి. నోరు

ఏదో చెప్పాలని ఆరాటపడుతున్నట్లు కదలబోతుంది. కనుబొమ్మలు ఏవో వైవిధ్యభరితమైన భావాల్ని ప్రకటిస్తాయి. అంతలోనే శరీరం మ్రాన్పడిపోతుంది.

ఇరుగూ పొరుగు, పరిచయస్థులు, సానుభూతి పరులు ఆమె అంతిమ క్షణాలను లెక్క పెట్టేందుకు అక్కడ గుమిగూడారు.

"పాపం! ఆ తల్లికి అంతిమ గడియలొచ్చేసాయి. ఆ పాపాత్ముడు ఇప్పుడైనా రాడా, ఇదే మన్యాయమే తల్లీ!"

"వాడెక్కడున్నాడో? ఏం జేస్తున్నాడో? ఎవ్వరికెరుక? అసలున్నాడో? లేడో!?"

"ఉండకెక్కడవోతడు? వాడేం చిన్న పొల్లగాడా? దేశం దెలిసిన మనిషి."

"నిజమే. ఉన్నడంట. సనత్‌నగర్‌ల వాళ్ళ మామకు గనిపించిండట."

"అరె, మరి గా ఖాజామియనే పంపించి, పొల్లగాన్ని ఎంటపెట్టుకరమ్మని జెప్పరాదు!?"

"ఆఁ ! వాడెన్నడు వోవాలె? తన బిడ్డ సంసారంల ఈ ముసల్దే చిచ్చు పెట్టిందని గొంతుదాంక విషం నింపుకున్నడు. వారం రోజులకింద వొయ్యి చూసొచ్చిండంట. ఎవ్వరికి ఖబర్‌గూడ ఇయ్యలే."

"అరే,మరి గా సంగతి నీకెట్ల దెలిసింది?"

"ఆడోళ్ళ నొట్ల మాట దాగుతాదివయా? గా ఇస్మాయెల్‌గాడు పెండ్లాం కోసం మామతోని బట్టలు, సొమ్ములు ఏమేమో పంపించిండంట. ఆ మాటలు నా బిడ్డతోని జెప్పిందా మైజాబీ."

వాళ్ళ మాటలు ఆ తల్లి కర్ణపుటాలను తాకాయో, నిజంగానే అంత్యకాలం వచ్చేసిందో కాని, ఒక్కసారిగా రోషన్‌బీ శరీరం యావత్తూ కదలసాగింది.

పోగైన వాళ్ళంతా ఆశ్చర్యంగా చూడసాగారు.

కాళ్లూ చేతులూ ఆడిస్తూ ఒక్కసారిగా కళ్ళుతెరిచింది. హఠాత్తుగా పైకి లేవబోయింది. ఆ ప్రయత్నంలో ఆమె తల కొన్ని అంగుళాల మేర పైకి లేచింది. పెదవులు కోల్పోయిన పట్టును సాధిస్తున్నట్లు కదలసాగాయి.

సంబంధం

"ము... ము... ము... న్నా.... "

పరుగు పరుగున ఇల్లు చేరుకున్న ఇస్మాయెల్ ఆర్తిగా "అమ్మీజాన్...." అంటూ ఒక్క అంగలో ఇంట్లోకొచ్చేశాడు.

అప్పటికే ఆ అమ్మ ప్రాణం అనంత వాయువుల్లో విలీనమైంది.

✠ ✠ ✠

## ఉపసంహారం

మొదట తల్లి ప్రేమను, తర్వాత ఇల్లాలి అనురాగాన్నీ దోసిళ్ళకొద్దీ తాగిన ఇస్మాయెల్ అటుపై శ్రమలోనూ ఆనందాన్ననుభవించాడు. తన ప్రేమను శ్రమతో మమేకం చేసి, అమ్మనూ, ఆలినీ రెండూ కళ్ళలా చూసుకోవాలనుకున్నాడు. కాని, ఆచరణలో పెట్టే సమయానికి వీటన్నింటికంటే బలమైన స్వార్థం ముందు కొరగాని వాడైపోయాడు. ఆ షాక్ అతణ్ణి అందరికీ దూరం చేసింది. ఆ తర్వాత పెళ్ళాం అందం అతడ్ని మార్చలేదు, సరికదా కొడుకు రక్తసంబంధం కూడా కదల్చలేకపోయింది. పిచ్చివాడైనా పరిచయాలు మిగిల్చిన గాయాలను తోడుకుంటూ అమ్మగోరీ వద్ద, ఊళ్ళో మసీదు వద్ద కాలక్షేపం చేయసాగాడు.

భర్తను ఆకర్షించి మార్చుకోవాలన్న ప్రయత్నం ఫలించక, కొడుకు కల్గింతర్వాతైనా మార్పొస్తుందన్న ఆశ ఫలించక, కలలన్నీ జీవితమనే బండల నడుమ గాజు పలకలై, కనరాని గాయాల వ్రణాలను చూస్తూ జీవం లేని జీవితాన్ని మోయదానికి రాజీపడిపోయింది మహేజబీ.

తానెంతో యుక్తి పరుడ్ననీ, ఏ సమస్యనైనా సాధించగలననీ, అల్లుడ్నీ కూతుర్నీ ఆనందంగా కలపగలిగానని విర్రవీగిన ఖజామియా – తన ఆలోచన 'వాపే గానీ బలుపుకా'దన్న సంగతి త్వరలోనే గ్రహించాడు. అహంకార మడుగంటిపోగా కూతురికి మరో జీవితాన్నైనా ప్రసాదించగలనేమోననే చివరి ప్రయత్నం కూడా బెడిసికొట్టడంతో 'చేతులు కాల్చుకొని... ' చేష్టలుడిగి – కూతుర్ని చూసుకుంటూ ఉండటం మినహా ఏమీ చేయలేకపోయాడు.

❀❀❀

**రచనా కాలం : నవంబర్ 2001 (అబ్బవారి కథాజగత్ –2007)**